RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2




| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 89 | ఏప్రిల్ 19 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 89 | April 19 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |



# నారీశక్తిపై జరిగిన ‘భ్రూణహత్య’

## మహిళా బిల్లును అడ్డుకోవడంపై తీవ్ర విమర్శ.. జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ ఘాటు ప్రసంగం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. శనివారం దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో విపక్షాల తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. మహిళా బిల్లును అడ్డుకోవడం ముమ్మాటికి ‘భ్రూణహత్య’ వంటిదేనని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ హితం కంటే రాజకీయాలే ముఖ్యమని భావించిన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెం, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలే ఈ చారిత్రక తప్పిదానికి బాధ్యులని ఆయన నేరుగా వేలెత్తి చూపారు. బిల్లు ఆమోదం పొందకపోవడంపై మహిళా లోకానికి మోదీ క్షమాపణలు చెబుతూ.. 40 ఏళ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతున్న మహిళల కలలను విపక్షాలు ధ్వంసం చేశాయని విమర్శించారు. కుటుంబ

➢ మిగతా 2వ పేజిలో..

# మహిళా బిల్లు ముసుగులో దక్షిణాదికి అన్యాయం

## కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** మహిళా రిజర్వేషన్ల అంశంలో కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ లేదని, బిల్లు ముసుగులో డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) తీసుకువచ్చి దక్షిణాది రాష్ట్రాలను దెబ్బతీయాలని చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళా బిల్లు వీగిపోవడం బీజేపీ అనుసరిస్తున్న తప్పుడు విధానాల ఓటమి అని అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ల పట్ల ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే, 2023 నాటి బిల్లును యథాతథంగా ప్రవేశపెట్టాలని, అందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ

➢ మిగతా 2వ పేజిలో..

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పార్లమెంట్ హౌస్‌లో తన అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ, ఈ బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్షాలు మహిళా సాధికారతకు తాము వ్యతిరేకమని నిరూపించుకున్నాయని విమర్శించారు. విపక్షాలు చేసిన ఈ పెద్ద తప్పిదానికి భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, ఈ విషయంలో వారు జీవితాంతం చింతిస్తారని ఆయన వ్యాఖ్యానించారు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి విపక్షాలు సాకులు వెతుకుతున్నాయని మండిపడ్డ

➢ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన తేజస్వీ సూర్య

## బీజేపీ, కాంగ్రెస్‌లపై హరీష్ రావు, కేటీఆర్ నిప్పులు

**జగిత్యాల:** లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఈ సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న ఆత్మగౌరవాన్ని తీవ్రంగా గాయపరిచాయని కేసీఆర్

➢ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి విందు

## రాజకీయాలకు అతీతంగా భేటీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధుల మధ్య అరుదైన కలయిక చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న భూపతిరాజు శ్రీనివాస వర్మ శనివారం ఉదయం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల నేతలకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు కీలక నేతలు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు కిన్జరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్,

➢ మిగతా 2వ పేజిలో..

# హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తత

## భారత నౌకలపై ఇరాన్ దళాల కాల్పులు



**టెహ్రాన్ జనసంఘర్షణ:** పశ్చిమాసియాలో పరిస్థితులు మరోసారి అత్యంత ఆందోళనకరంగా మారాయి. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తిరిగి మూసివేసిన కొద్ది గంటల్లోనే, అక్కడ ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ దాడుల్లో రెండు భారతీయ నౌకలు ముడి చమురు ట్యాంకర్ ‘సన్మార్ హెరాల్డ్’, మరియు యూరియా లోడ్‌తో ఉన్న ‘జగ్ ఆర్నవ్’ లక్ష్యంగా కాల్పులు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో

➢ మిగతా 2వ పేజిలో..

# 20న రెండో విడత రైతు భరోసా విడుదల

## రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార




**హైదరాబాద్ జనసంఘర్షణ** తెలంగాణలోని అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల హామీల అమలులో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘రైతు భరోసా’ పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో, వారికి పెట్టుబడి సాయం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నగదును

➢ మిగతా 2వ పేజిలో..

# నారీశక్తిపై జరిగిన 'భ్రూణహత్య'

**మొదటిపేజీ తరువాయి..** పార్టీలు ఎన్నడూ మహిళలను ఎదగనివ్వవని, ఈ పాపం ఆ పార్టీలను వదిలిపెట్టదని హెచ్చరించారు. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) విషయంలో కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని, ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా, అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరిగేలా తాము సవరణ బిల్లు తెచ్చామని ప్రధాని స్పష్టం చేశారు. బిల్లు ఆమోదం పొంది ఉంటే అన్ని పార్టీలకు సీట్లు పెరిగే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సంస్కరణలకు వ్యతిరేకమని.. గతంలో జనధన్, జీఎస్టీ, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ వంటి ప్రతి మంచి నిర్ణయాన్ని అడ్డుకోవడమే ఆ పార్టీ నైజమని మోదీ మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, రాబోయే రోజుల్లో దేశంలోని నారీశక్తి ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెబుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల కోసం తన పోరాటం ఆగదని, నారీశక్తి సాధికారత కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ప్రధాని పునరుద్ఘాటించారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాని, ప్రతిపక్షాల మహిళా వ్యతిరేక ధోరణిని దేశంలోని ప్రతి గ్రామానికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లు 298-230 ఓట్ల తేడాతో వీగిపోయిన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరటనిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని కరవు భత్యాన్ని (డీఏ) 2 శాతం పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. సాధారణంగా ఏటా జనవరి, జూలై నెలల్లో జరిగే ఈ సవరణ ఈసారి ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో వ్యక్తమైన ఆందోళనకు ఈ నిర్ణయంతో తెరపడింది. మరోవైపు, సముద్ర రవాణా రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ. 13,000 కోట్లతో 'సావరిన్ మారిటైమ్ ఫండ్' ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి వంటి ప్రాంతాల్లో నౌకలపై దాడులు జరుగుతున్న తరుణంలో, భారతీయ నౌకలకు మరియు భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ కల్పించడమే లక్ష్యంగా ఈ భారీ నిధిని కేటాయించారు. ఈ కేబినెట్ భేటీ అటు రాజకీయ పోరాటానికి, ఇటు ఉద్యోగుల సంక్షేమానికి మరియు దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముగిసింది.

## మహిళా బిల్లు ముసుగులో దక్షిణాదికి అన్యాయం

**మొదటిపేజీ తరువాయి..** మహిళలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. అటువంటి స్వచ్ఛమైన మహిళా బిల్లుకు తాము (ఇండి కూటమి) బేషరతుగా మద్దతు ఇస్తామని, అవసరమైతే దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ అమలు చేసి, ఉత్తర భారతానికి అనుకూలంగా సీట్లు పెంచుతూ దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించాలని చూస్తున్నారని, ఈ కుట్రను లోక్‌సభ సాక్షిగా అడ్డుకున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఇప్పటికైనా ఉత్తర-దక్షిణ భారత్ మధ్య అంతరాలు పెంచే విధానాలను విరమించుకోవాలని హితవు పలికారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బీజేపీతో జతకట్టిన ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తులో గడ్డు కాలం తప్పదని హెచ్చరిస్తూ.. తెలుగుదేశం పార్టీ మరియు చంద్రబాబు నాయుడు కూడా అదే ప్రమాదంలో ఉన్నారని వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండేల ఉదాహరణలను గుర్తు చేస్తూ, కేంద్రంలో మెజారిటీ ఉందని రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, డిక్టేటర్‌షిప్‌ను ఎవరూ అంగీకరించరని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తత

**మొదటిపేజీ తరువాయి..** నౌకల్లోని సిబ్బందికి ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అయితే నౌకల అద్దాలు పగిలి కొంత మేర నష్టం వాటిల్లిందని సమాచారం. ఈ పరిణామంతో భారత్‌కు రావాల్సిన దాదాపు 13 నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి మళ్లాయి. అమెరికాతో జరుపుతున్న చర్చల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు శుక్రవారం ప్రకటించిన ఇరాన్, శనివారం నాటికి తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన నౌకా దళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడమే ఇందుకు ప్రధాన కారణం. అమెరికా తమను బ్లాక్ మెయిల్ చేయలేదని ట్రంప్ స్పష్టం చేయడంతో, ప్రతి చర్యగా ఇరాన్ మళ్లీ జలసంధిని మూసివేసి గస్తీని ముమ్మరం చేసింది. భారత నౌకలపై జరిగిన ఈ కాల్పుల ఘటనను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి కేంద్ర విదేశాంగ శాఖ గట్టి నిరసన వ్యక్తం చేసింది. ప్రస్తుతం హోర్ముజ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అంతర్జాతీయ చమురు రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

# 20న రెండో విడత రైతు భరోసా విడుదల

**మొదటిపేజీ తరువాయి..** జమ చేయనున్నారు. ఈ రెండో విడత ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున అందజేసే ఈ విడతలో 45,11,947 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ. 5,653 కోట్లను వెచ్చిస్తోంది. ఇప్పటికే మొదటి విడతలో రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం, తాజా నిధులతో కలిపి మెజారిటీ రైతులను ఆదుకోనుంది. మిగిలిన రైతులకు మూడో విడతలో నిధులు విడుదల చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో ఈ సాయం అందడం వల్ల రైతులకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుందని, వ్యవసాయ పనులు మరింత వేగవంతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన తేజస్వీ సూర్య

**మొదటిపేజీ తరువాయి..** 'ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల మీద విషం చిమ్ముతున్నా రాష్ట్రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు పెదవి విప్పకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం రాజకీయ డ్రామా అని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పుకు సంకేతమని, జగిత్యాల నుంచే పార్టీ జైత్రయాత్ర మొదలవుతుందని వెల్లడించారు. కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తుంటే భయపడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా పోటీ సభలు పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా 20న జరిగే కేసీఆర్ ఆశీర్వాద సభ విజయవంతం అవుతుందని, కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి విందు

**మొదటిపేజీ తరువాయి..** కుమారస్వామి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్, టీడీపీ ఎంపీలు, ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తదితరులు ఈ విందులో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, ఈ భేటీలో ఎటువంటి రాజకీయ కోణం లేదని, కేవలం తెలుగు నేతల మధ్య సఖ్యత కోసమే దీనిని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని డిసెంబర్ 9 నాటికి 'క్లీన్ అండ్ గ్రీన్'గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా మరిన్ని ఎలక్ట్రిక్ (జుఎ) బస్సులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారని, అందుకు సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే బస్సులను అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇక మహిళా రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ.. 2029 నుంచి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, విపక్షాలు వ్యతిరేకించినప్పటికీ 2029 నుంచే ఇవి అమలు కావాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల అభివృద్ధిపై నేతల మధ్య ఈ సందర్భంగా ప్రాథమిక చర్చలు జరిగినట్లు సమాచారం.

## స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

### పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్18 :** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు.

# వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరంగల్ విమానాశ్రయం కోసం ప్రభుత్వం ఇప్పటికే 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని, త్వరలోనే దీనికి శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ (ఇవటవఅఛెవ), పౌర విమానయాన శాఖ మరియు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయని, దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయానికి అనుకూలం కాదని కేంద్రం తెలిపిన నేపథ్యంలో, ప్రత్యామ్నాయాలపై లోతైన అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లు అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ఆర్థికాభివృద్ధికి బాటలు పడతాయని మంత్రి ఆకాంక్షించారు.

## ఐకెపి వడ్లు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సతీమణి



**రామగుండం,ఏప్రిల్ 18**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీమణి మనాలి ఠాకూర్ బసంత్‌నగర్ ఎయిర్‌పోర్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ వడ్లు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి ) కల్పించడం మరియు మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వానికి వడ్లు విక్రయించే అవకాశం కల్పించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది కీలకమైన ముందడుగు అని తెలిపారు.

అలాగే ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు సమయానికి చెల్లింపులు అందడం,రవాణా సమస్యలకు పరిష్కారం లభించడం,మొత్తంగా రైతుల ఆదాయం పెరగడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు,నాయకులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ఈ సందర్భంగా రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## నల్ల బ్యాడ్జీలతో ఐటిసి కార్మికుల నిరసన

**భద్రాచలం, ఏప్రిల్18 :** కార్మిక సమస్యలు తక్షణం పరిష్కరించాలని కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఐటీసీ కర్మాగారం అడ్మిన్ బ్లాక్ వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పరిష్కరించడం లేదని, 14వ వేతన ఒప్పందం కార్మికులకు ఆమోదయోగ్యంగా రూ.22 వేలకు తగ్గకుండా చేయాలని, కార్మికులందరికీ 100శాతం అన్లిమిటెడ్ మెడికల్ స్కీంను తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అడ్మిన్ బ్లాక్‌లో కార్మికులంతా నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు.


జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


# తెలంగాణ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై బిగ్ అప్డేట్..

❑ **రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ**

జన సంఘర్షణ డెస్క్ ఏప్రిల్ 18

తెలంగాణలో మరోసారి ఎన్నికల నగరా మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల సందడి మళ్లీ మొదలు కానుంది. గత డిసెంబర్ నెలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పూర్తి కాగా..ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు కూడా నిర్వహించారు. తాజాగా.. ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న మండల, జిల్లా ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి శుక్రవారం కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుండి 2026 ఫిబ్రవరి 5 వరకు నవీకరించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఈ ప్రక్రియ కొనసాగనుంది. నియోజకవర్గాల్లోని అదనపు ఓటర్లను గుర్తించి, వారిని సంబంధిత పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల వారీగా వర్గీకరించాలని అధికారులు ఆదేశించారు. ఈ డేటాను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ యూజర్ మాన్యువల్ ప్రకారం పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించాల్సి ఉంటుంది. డేటాలో ఏవైనా లోపాలు ఉంటే ఈ నెల 23వ తేదీలోపు నివేదించాలని, ఆ తర్వాత ముసాయిదా జాబితాలను విడుదల చేసి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని ఎస్ఈసీ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. చివరిసారిగా 2019 మే నెలలో మూడు దశల్లో ఈ ఎన్నికలు జరిగాయి. గత ఏడాది జూన్‌తో ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వాస్తవానికి గతేడాది సెప్టెంబరులోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ.. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో నెలకొన్న న్యాయపరమైన చిక్కుల వల్ల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా హైకోర్టు అనుమతితో రిజర్వేషన్ల ఖరారు తర్వాత మే నెలలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే పట్టణీకరణ పెరగడంతో 2019తో పోలిస్తే స్థానాల సంఖ్యలో మార్పులు చోటుచేసుకున్నాయి. పలు గ్రామ పంచాయతీలు పురపాలికల్లో విలీనం కావడంతో ఈసారి 44 ఎంపీటీసీలు, 4 జడ్పీటీసీ స్థానాలు తగ్గాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అందించిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం రాష్ట్రంలో



మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను పూర్తిగా పట్టణ జిల్లాగా మార్చడంతో జిల్లా పరిషత్‌ల సంఖ్య 31కి పరిమితమైంది. ఓటర్ల జాబితా ఖరారు కాగానే బ్యాలెట్ బాక్సుల తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి పరిపాలనాపరమైన చర్యలు చేపట్టనున్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించగా.. ఇదే ఊపు కొనసాగించాలని హస్తం పార్టీ భావిస్తోంది. పార్టీ సింబల్‌పై జరిగే ఎన్నికలు కావటంతో సత్తా చాటాలని బీఆర్ఎస్, బీజేపీ సైతం వ్యూహాలకు పదును పెడుతోంది.

# పోలీసులకు లొంగిపోయిన మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహెల్

బోధన్ : ఏప్రిల్ 18 జన సంఘర్షణ

హిట్ అండ్ రన్ కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్ జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 2022 లో బెలూన్లు అమ్మే మహిళ కాజోల్ చౌహాన్ జూబ్లీహిల్స్ రోడ్ నం.45లో రోడ్డు దాటుతుండగా ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న షకిల్ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళ చేతిలో ఉన్న శిశువు కిందపడి మృతిచెందింది. ఆమె తీవ్రంగా గాయపడింది. హిట్ అండ్ రన్ ఘటనలో నిందితుడిగా ఉన్న రాహెల్ పరారీలో ఉండగా, కోర్టు ఆదేశాలతో పోలీసుల ఎదుట హాజరయ్యాడు. జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసులో కీలక పరిణామం.. లొంగిపోయిన మాజీ ఎమ్మెల్యే షకీల్? కుమారుడు! జూబ్లీహిల్స్ కేసు గురించి తెలిసి ఈ కేసును మళ్లీ పరిశీలించారు. ఆ కేసులో పోలీసులు లొంగిపోయిన వ్యక్తి వాంగ్మూలం నమోదు చేశారు. హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం.

**అసలేం జరిగిందంటే.. ఇదిలా ఉండగా...**

దీర్ఘకాలంగా ఈ కేసు విచారణ కొనసాగుతుండగా, తాజాగా నిందితుడు స్వచ్ఛందంగా పోలీసుల



ఎదుట హాజరయ్యాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బాధ్యతపై దృష్టి సారించారు. ఈ పరిణామం నగరంలో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..**

మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబం ఫిబ్రవరి 17, 2022న జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ఫుట్‌పాత్ వద్ద ఉంటూ బెలూన్లు, స్ట్రాబెర్రీలు విక్రయిస్తున్నారు. ఆ సమయంలో ఓ కారు వీరిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో చిన్నారి రణవీర్ పరిస్థితి విషమించి మరణించాడు. అయితే ప్రమాదం జరిగిక కారులో ఉన్న ముగ్గురు యువకులు పారిపోయారు. ఆ కారుపై అప్పటి బోధన్ ఎమ్మెల్యే షకీల్ పేరుతో స్టిక్కర్ ఉంది. దీంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు నమోదు తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, కారు నడిపింది తానేనంటూ అఫ్రాన్ అనే వ్యక్తి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కారులో తనతో పాటు రాహిల్, మరో స్నేహితుడు మహమ్మద్ మాజ్ ఉన్నారని చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలో ఆ ఇద్దరి పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

**ఇదిలా ఉండగా...**

2023లో ప్రజాభవన్ వద్ద బారికేడ్లు ఢీ కొన్న ప్రమాదంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. జూబ్లీహిల్స్ కేసు గురించి తెలిసి ఈ కేసును మళ్లీ పరిశీలించారు. ఆ కేసులో పోలీసులు లొంగిపోయిన వ్యక్తి వాంగ్మూలం నమోదు చేశారు. అందులో ప్రమాదం జరిగినప్పుడు సదరు కారు నడిపింది రాహిల్ అని తేలింది. తానే కారు నడిపినట్లు అంగీకరించాలంటూ రాహిల్ బంధువులు తనను బలవంతంగా ఒప్పించారని పోలీసులకు లొంగిపోయిన వ్యక్తి తెలిపినట్లు సమాచారం.

# ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లండి - గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమం

సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ)



ఖమ్మం జిల్లా, సింగరేణి మండలం గంపేళ్ళగూడెం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి అంశాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, తల్లిదండ్రులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హరీష్ మాట్లాడుతూ.. విద్య అనేది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, మంచి విలువలు, క్రమశిక్షణ ప్రభుత్వ పాఠశాలల ద్వారా పెంపొందుతాయని తెలిపారు. సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా గ్రామ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని, సమాజ అభివృద్ధికి అది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సర్పంచ్ కృష్ణవేణి-వీరబాబు, పంచాయతీ సెక్రటరీ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో చైతన్యం పెరిగి, ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు.

# పట్టణ ప్రగతిలో భాగస్వాములవ్వండి

❑ **పన్ను చెల్లింపుపై 5% రాయితీ**


ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

పట్టణ సర్వతోముఖాభివృద్ధికి పన్నులే ప్రధాన వనరులని, సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ పురోగతిలో పౌరులు భాగస్వాములు కావాలని ఇల్లందు పురపాలక అధికారులు పిలుపునిచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 30వ తేదీలోపు ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీ వర్తిస్తుందని వారు వెల్లడించారు. మనం చెల్లించే పన్నులే మౌలిక సదుపాయాల కల్పనకు మార్గదర్శకాలని గుర్తు చేస్తూ, ఈ వెసులుబాటును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిజానికి పన్ను చెల్లింపు అనేది కేవలం చట్టబద్ధమైన విధి మాత్రమే కాదు, అది మన నివసించే పరిసరాల నాణ్యతను పెంచుకునే ఒక సామాజిక బాధ్యత. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా, ఈ రాయితీ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా అటు వ్యక్తిగత ఆదాను, ఇటు పట్టణ అభివృద్ధిని కాంక్షించాల్సిన సమయం ఆసన్నమైంది.




# బపునగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ఎ.పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 18( జసంఘర్షణ )



గాంధీనగర్ డివిజన్, చిక్కడపల్లి, బాపు నగర్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయ 42వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన శివ పార్వతుల కళ్యాణంలో పాల్గొని తిలకించారు. ఆలయ పూజారులు కార్పొరేటర్ దంపతులను సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీకాంత్, ఆనంద్ రావు, సాయి కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ జి.దామోదర్, అధ్యక్షులు సదానంద, ఆలయ కమిటీ సభ్యులు రాజు, సురేందర్ రెడ్డి, సురేష్, అశోక్, బబ్బీ, గణేష్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

బోధన్: ఏప్రిల్ 18 జన సంఘర్షణ



నిజామాబాద్ జిల్లాకు సంబంధించి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీని రెండేళ్ల కాల పరిమితికి ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ ఛైర్మన్గా ఉన్న కమిటీలో సభ్యులుగా జి.సాయి ప్రసాద్, బాల కుమార్, నర్సింహులు, భూపతి, రామదయానంద్, మహ్మద్ గౌస్, శ్రీనివాస్, శ్రీకాంత్, మాజిద్, జాన్సన్లను నియమించారు.

# జనగణన మొదటి దశ శిక్షణ ఎంఈఓ తరగతులు..

బోధన్ : ఏప్రిల్ 18 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బోధన్ తహసీల్దార్, బోధన్ ఎంఈఓ తో కలిసి బోధన్ సబ్ కలెక్టర్ వీసీ హాల్‌లో జనగణన నిర్వహించారు. జనగణన మొదటి దశ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ శిక్షణ ద్వారా ఫీల్డ్ సిబ్బందికి జనగణన ప్రక్రియ, నియమాలు వారి బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. లక్ష్యంగా నిర్వహించారు, తద్వారా డేటా సేకరణను సక్రమంగా నిర్వహించవచ్చున్నారు. శిక్షణ సందర్భంగా సబ్-కలెక్టర్ బోధన్, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లతో మాట్లాడుతూ... జనగణన విజయవంతంగా నిర్వహించారు. వారి పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. మొత్తం 34 పాయింట్లను జాగ్రత్తగా అధ్యయనం చేయాలని సూచిస్తూ, ఏవైనా సందేహాలు ఉంటే తప్పకుండా అడగాలని ప్రోత్సహించారు. శిక్షణ సమయంలోనే సందేహాలను నివృత్తి చేసుకుంటే ఫీల్డ్‌లో పని చేసే సమయంలో పొరపాట్లు తప్పించుకోవచ్చని కూడా పేర్కొన్నారు.

# బోధన్ పట్టణంలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

బోధన్ : ఏప్రిల్ 18 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్ వద్ద శనివారం ఉదయం ప్రజాపాలనలో భాగంగా పట్టణంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. అచన్పల్లి ఎక్స్ రోడ్ నుంచి ఏఆర్ గార్డెన్ వరకు గల ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) పరిశీలించి, వాహనదారులకు భద్రతా సూచనలు చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మా శరత్ రెడ్డి, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# కల్దుర్కి రామన్ చెరువులో భారీ సంఖ్యలో చేపలు మృతి

బోధన్: ఏప్రిల్ 18 జన సంఘర్షణ



బోధన్ మండలం కల్దుర్కి రామన్ చెరువులో వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడటం మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘటన యొక్క ముఖ్య వివరాలు..చేపల మృతి కల్దుర్కి రామన్ చెరువులో భారీ సంఖ్యలో చేపలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి.

మత్స్యకారుల నష్టం: ఈ చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు తీవ్ర నష్టపోయారు, దీనితో వారు ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్నారు.

ప్రభుత్వ సహాయం: మత్స్యకారులు ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

కారణాలు (అనుమానాలు): వేసవి తీవ్రత కారణంగా నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం లేదా కలుషిత నీరు చేరడం వల్ల చేపలు చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

# అంచనూరులో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

దోమకొండ, ఏప్రిల్ 18, ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంచనూరులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ జనగామ నరేష్, ఉపసర్పంచ్ కందుకూరి ప్రభాకర్, సొసైటీ ఇన్ ఛార్జ్ బాల్రెడ్డి పాల్గొన్నారు. గతంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఉన్న కేంద్రాన్ని రైతుల విజ్ఞప్తి మేరకు సొసైటీకి మార్చాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆమోదించారు. దీంతో కలెక్టర్కు సర్పంచ్, పాలకవర్గం, రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బయ్యారం ఉక్కు - తెలంగాణకు గ్రీన్ హక్కు

❑ పారిశ్రామిక విప్లవం దిశగా అడుగులు!

ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

దశాబ్దాలుగా ఉక్కు కర్మాగారం కోసం ఎదురుచూస్తున్న బయ్యారం గడ్డపై పర్యావరణ హితమైన 'గ్రీన్ స్టీల్ ప్లాంట్'ను నెలకొల్పడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహానికి తెరలేపారు. శనివారం ఢిల్లీ వేదికగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో భేటీ అయిన ముఖ్యమంత్రి, రాష్ట్ర అభివృద్ధి మ్యాపులో బయ్యారం ప్రాముఖ్యతను వివరించారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా అటు హైదరాబాద్‌ను గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఈవీ బ్యాటరీల హబ్‌గా మారుస్తూనే, బయ్యారం ప్రాంతంలో అత్యాధునిక సాంకేతికతతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామికీకరణే భవిష్యత్తుకు ఆధారం అని, ఇది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించే సంజీవని అని ఆయన ఉద్ఘాటించారు. కేవలం అంకెలు, టెండర్లకే పరిమితం కాకుండా, ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతిని సాధించాలనే ఈ 'గ్రీన్ విజన్' సఫలమైతే, బయ్యారం దశ దిశ మారిపోవడం ఖాయం. అభివృద్ధి అంటే పర్యావరణాన్ని బలిపెట్టడం కాదు, పర్యావరణాన్ని భాగస్వామిని చేస్తూ అభివృద్ధి చెందడం అనే సరికొత్త సామాజిక బాధ్యతను ఈ ప్రతిపాదన గుర్తు చేస్తోంది. పాలకులు మారుతున్నా బయ్యారం కల మాత్రం అలాగే ఉంది, ఇప్పుడున్న ఈ గ్రీన్ స్టీల్



ఆలోచన ఆ కలను నిజం చేస్తుందో లేదో వేచి చూడాలి.

# భద్రాద్రిలో భక్తి ప్రభంజనం

❑ కల్పవృక్ష ఆశ్రమంలో ఆధ్యాత్మిక వైభవం




భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలోని కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమం శుక్రవారం ఆధ్యాత్మిక జనసంద్రమైంది. డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ క్రతువుల్లో గోపూజ, తిరుమంజన సేవలతో మొదలై, లోక కల్యాణార్థం నిర్వహించిన మహాలక్ష్మి నారాయణ, మృత్యుంజయ హోమాలు శాస్త్రోక్తంగా సాగాయి. ముఖ్యంగా సంతాన ప్రాప్తి కోసం జరిపిన వైనతేయ హోమంలో వేలాదిగా దంపతులు పాల్గొనడం గమనార్హం. సుమారు 15 వేల మంది భక్తుల రాకతో ఆశ్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. కేవలం పూజలకే పరిమితం కాకుండా, విశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచిన ఈ హోమాలు.. యాంత్రిక జీవనంలో సతమతమవుతున్న మనిషికి మానసిక ప్రశాంతతను, నైతిక బలాన్ని ప్రసాదించే దిశగా సాగాయి. భక్తి అనేది కేవలం వేడుక కాదు, అది సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు సనాతన ధర్మాన్ని అందించే ఒక గొప్ప బాధ్యత అని ఈ ఉత్సవం మరోసారి నిరూపించింది.

# ప్రభుత్వ బోరు... ప్రైవేటు వెంచర్లకు నీటి సరఫరా

❑ పట్టింపులేని మున్సిపల్ శాఖ ముడుపులు
❑ లక్షలు గడిస్తున్న నర్సిగొండ
❑ మీడియా అడుగుతే బోరుకు తాళం వేస్తాం.
❑ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

తెలంగాణ బాన్సువాడ / ఏప్రిల్18/(జన సంఘర్షణ)





కాలనీలో మంచినీటి సమస్య ఎదురైనప్పుడు ఈ బోరు ద్వారా మంచినీటి సమస్యను పరిష్కరించడానికి కామారెడ్డి జిల్లా బాన్సువాడ 4వ లో బోర్ వేశారు మున్సిపాలిటీ. ఇది కేవలం ఏదైనా శుభ కార్యాలకు, మంచినీటి ఎద్దడి ఎదురైతే ఈ బోర్డ్ ద్వారా మంచినీటి సరఫరా చేయడానికి వేసిన బోరు, ఓ ప్రైవేటు వ్యక్తి దర్జాగా నన్ను ఎవడు ?ఏమి చేయగలడు? అనే ధీమాతో ప్రభుత్వ బోర్డు నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా నింపుకొని వెంచర్లకు సరఫరా చేస్తుంటే మున్సిపాలిటీ అధికారులు అవినీతికి చోటు కల్పిస్తున్నారు. ప్రతిరోజు వేలాది రూపాయల విలువచేసే మంచి నీటిని వెంచర్లకు తరలిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు బాన్సువాడ కట్టడానికి చెందిన నర్సిగొండ. గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి రెండు ట్యాంకర్ల ద్వారా కొన్ని నెలలు నీటి సరఫరా చేసి లక్షలు అందుకున్నారు. ఈ విషయంపై మన దినపత్రిక వరుస కథనాలు రాయడంతో స్పందించడం మున్సిపాలిటీ అధికారులు వాటి ఫీజులను తొలగించారు. మళ్లీ ఏదో విధంగా నీటి చోరీ జరుగుతుంది. బాన్సువాడ నియోజకవర్గంలో ఒక మంచి నీరే కాదు.. మొరం, ఇసుక, కంకర ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్షల రూపాయల విలువ చేసే ఈ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన ఒకవైపు మున్సిపాలిటీ, మరొకవైపు రెవెన్యూ శాఖ, మరొకవైపు భూగర్భగనుల శాఖ, ఖనిజ అభివృద్ధి సంస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. ముందే వేసే కాలం ప్రతి ఒక్క చుక్క బొట్టు ఒడిసి పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ బోర్డు నుంచి ఇష్ట రాజ్యాంగ రోజుకు 10 ట్యాంకర్లపైగా వెంచర్లకు తరలిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. వెంచర్లలో సిమెంట్ రహదారులు, మురికి కాల్వల నిర్మాణాలు జరగడంతో వాటికి నీరు అవసరం ఉండడంతో ట్యాంకర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు నీటిని అమ్ముకుంటున్నారు. అక్కడ ప్రభుత్వ బోర్డు నుంచి నయా పైసా చెల్లించకుండా ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకువచ్చి వెంచర్లకు, ఆస్పత్రి భవనాలకు, ఇంటి నిర్మాణాలకు సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈ బోరు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా నీటిని అక్రమంగా తరలించక పోకూడదని ఆంక్షలు ఉన్నప్పటికీ, నియోజకవర్గాన్ని ఏలే రారాజు తమ వాడు తమకు ఎవరు అడ్డం అంటూ బాన్స్వాడ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నీటి చోరీ జరుగుతుంది. ఒకవేళ మంచినీటి బోరు చెడిపోతే దానిని మరమ్మత్తులు చేయించేది ఎవరు? అంటూ కాలనీవాసుల ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికప్పుడు మున్సిపాలిటీ అధికారులు రహదారులను, మురికి కాల్వలను, విద్యుత్ దీపాలను, మంచినీటి సౌకర్యం కల్పించవలసి ఉండగా వీటిని అన్నిటిని పక్కన పెట్టి చేతులు ఎత్తివేశారు.






ఫలితం ప్రైవేట్ వ్యక్తులు కొండలను గుట్టలను మాయం చేస్తుండగా మరికొందరు మంచినీటి చోరీకి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఇప్పటివరకు ఎన్ని ట్యాంకర్ల నీటిని తీసుకువెళ్లారు యజమాని ద్వారా రికవరీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంగమేశ్వర్ కాలనీలో ఉన్న మంచినీటి బోరు నుంచి ఓ కాంట్రాక్టర్ నర్సిగొండ నీటిని ఉచితంగా తరలిస్తూ ఒకవైపు వెంచర్లకు, మరొకవైపు భవనాల నిర్మాణాలకు సరఫరా చేస్తున్న విషయాన్ని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆ బోరుకు తాళం వేస్తానని మన దినపత్రిక తెలంగాణ స్టేట్ చీఫ్ బ్యూరో తో వెల్లడించారు. మరోసారి ఇలాంటి విషయం పురావృతం కాకుండా చూస్తామని కమిషనర్ వెల్లడించారు. ప్రభుత్వ బోర్డు నుంచి అక్రమంగా మంచినీటి సరఫరా తరలించకపోతే వారికి భారీ జరీ మన వేస్తామని కమిషనర్ వెల్లడించారు. కొన్ని నెలలుగా నర్సిగొండ ఈ బోరు నుంచి వందలాది ట్యాంకర్ల నీటిని తరలించకపోయి లక్షలు గడించారు. దీంట్లో మున్సిపాలిటీలో పని చేస్తే కొందరికి నెలనెలా చేతులు తడుపుతున్నారు.

# అన్నదాతకు తప్పని తిప్పలు

❑ నిలిచిన మొక్కజొన్న కొనుగోళ్లు






ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకునేందుకు సిద్ధమైన రైతుకు మార్కెట్ యార్డులో నిరాశే ఎదురవుతోంది. నిల్వ సామర్థ్యం మించిపోయిందన్న సాకుతో ఇల్లందు మార్కెట్ యార్డ్ చైర్మన్ పేరుతో కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు బ్యానర్లు ఏర్పాటు చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. నిల్వ ఉన్న ధాన్యం తరలించే వరకు కొత్తగా వచ్చే దిగుబడిని అనుమతించబోమన్న అధికారుల నిర్ణయం రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. ఆకాశం మేఘావృతమై వర్షం ముప్పు పొంచి ఉన్న వేళ, ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిసిపోతుందేమోనన్న భయం అన్నదాతలను వణికిస్తోంది. ప్రభుత్వం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న నిల్వ సమస్యలను యుద్ధప్రతిపాదికన పరిష్కరించి కొనుగోళ్లు పునఃప్రారంభించాలని రైతు సంఘాలు గళమెత్తుతున్నాయి. పాలకుల ప్రణాళికా లోపం పండించిన వాడికి శాపంగా మారకూడదని, అలుపెరగని శ్రమకు గిట్టుబాటు ధరతో పాటు భద్రత కల్పించడం వ్యవస్థ కనీస ధర్మమని ఈ పరిస్థితి గుర్తు చేస్తోంది.

# దక్షిణ అయోధ్యకు పూర్వవైభవం

❑586 కోట్లతో భద్రాద్రి క్షేత్ర పునర్నిర్మాణానికి శ్రీకారం!

భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)



దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రానికి ఎట్టకేలకు మహర్దశ పట్టింది. సుమారు రూ. 586 కోట్ల భారీ వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు కావడంతో భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అత్యున్నత స్థాయి వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. కేవలం భౌతిక నిర్మాణాలే కాకుండా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. బాసర అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్లు కేటాయించగా, భద్రాచలంపై ప్రత్యేక దృష్టి సారించి అధిక నిధులు వెచ్చించడం విశేషం. అయితే, అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు మాత్రమే కాదు, క్షేత్రానికి వచ్చే సామాన్య భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం, కనీస సౌకర్యాలు అందడం ముఖ్యం. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ పునర్నిర్మాణం కేవలం పాలకుల హామీగానే మిగిలిపోకుండా, రాబోయే పుష్కరాల వేళ భద్రాద్రి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా సకాలంలో పూర్తి కావడమే ఇప్పుడు మన ముందున్న అసలైన సవాలు.

# అభివృద్ధి ముసుగులో 'విధ్వంసం'



❑ కోర్టు స్టే ఉన్నా ఆగని బుల్డోజర్లు!

భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

భద్రాద్రి రామాలయ పునర్నిర్మాణ పనుల పేరుతో అధికారులు శనివారం జరిపిన కూల్చివేతలు తీవ్ర ఉద్రిక్తతకు, అంతకంటే మిన్నగా ఆవేదనకు దారితీశాయి. ఆలయ తూర్పు వైపున ఉన్న 5 దుకాణాలను ముందస్తు నోటీసులు లేకుండానే నేలమట్టం చేయడం అధికారుల ఏకపక్ష వైఖరికి నిదర్శనంగా నిలిచింది. హైకోర్టు స్టే అమల్లో ఉన్నా, కోర్టు ధిక్కరణ కేసులు నడుస్తున్నా ఏమాత్రం లెక్కచేయకుండా న్యాయవ్యవస్థను సైతం ధిక్కరించడం ప్రజాస్వామ్యంలో ఆందోళన కలిగించే అంశం. కనీసం లోపల ఉన్న సామగ్రిని తీసుకునే వ్యవధి ఇవ్వకుండా, అడ్డువచ్చిన మహిళలను బలవంతంగా లాగివేసి జీవనోపాధిని చిన్నాభిన్నం చేసిన తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో సామాన్యుడి కడుపు కొట్టడమేనా అసలైన పురోగతి? చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ చేసే నిర్మాణాలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతిరూపాలు కాగలవా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారం చేతిలో ఉంది కదా అని సామాన్యుడి గొంతు నొక్కడం సంక్షేమ రాజ్యానికి శ్రేయస్కరం కాదు. అభివృద్ధి అవసరమే, కానీ అది విచక్షణతో కూడినదిగా ఉండాలి తప్ప, పేదవాడి కన్నీటి మీద నిర్మించే మేడ కాకూడదని ఈ ఉదంతం మనల్ని ఆలోచింపజేస్తోంది.

# అడ్మిన్లు బాధ్యతగా వ్యవహరించాలి: ఎస్ఐ

మాచరెడ్డి, ఏప్రిల్ 18 ( జన సంఘర్షణ )





కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో వాట్సాప్ గ్రూప్లలో తప్పుడు వార్తలు, విద్వేషపూరిత సందేశాలు పంపొద్దని ఎస్సై అనిల్ హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లు బాధ్యతగా వ్యవహరించి అలాంటి పోస్టులను వెంటనే తొలగించాలని నిర్ధారణ లేని సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనిల్ మండల ప్రజలకు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలపై వినూత్న పద్ధతిలో అవగాహన కార్యక్రమం

బీబీపేట్ ఏప్రిల్ 18, ( జన సంఘర్షణ )








కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా బీబీపేట్ ఎస్ఐ కొండా విజయ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీబీపేట్ పెద్దమ్మ ఆలయం వద్ద వాహనదారులకు గులాబీ పువ్వులు అందిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించాలని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయ పీఠంపై నూతన సారథి

❑ ప్రజా పక్షపాతిగా ప్రేమలత



కొత్తగూడెం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)

జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన పి. ప్రేమలతని శుక్రవారం సింగరేణి ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేవలం ఇదొక అధికారిక కలయికగానే కాకుండా, జిల్లాలో న్యాయవ్యవస్థ బలోపేతం దిశగా సాగిన ఆత్మీయ చర్చగా నిలిచింది. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమెను ఎస్ఓటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ సి.హెచ్. రామకృష్ణ, భూక్య తావుర్య నాయక్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. న్యాయ పరిపాలనలో ఆమె తనదైన ముద్ర వేయాలని, ముఖ్యంగా సామాన్యులకు న్యాయం చేరువ చేయడంలో ఈ మార్పు ఒక మైలురాయిగా నిలవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. చట్టం పట్ల నమ్మకాన్ని, వ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించే దిశగా సాగే ఈ నూతన ప్రయాణం జిల్లా ప్రజల ఆశలకు ప్రతిరూపంగా నిలవనుంది.

# పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం

దోమకొండ, ఏప్రిల్,18 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో శనివారం గ్యాస్ సిలిండర్ పేలింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన కూలీలు పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఉదయం వంటలు చేసుకొని పనులకు వెళ్లారు. గ్యాస్ సిలిండర్ను బయట ఉంచడంతో ఎండ తీవ్రతకు పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పి వేశారు.

## అంతర్జాతీయ సదస్సుకు బీబీపేట్‌కు చెందిన డా. తంగళ్ళపల్లి సంతోష్ గౌడ్



బీబీపేట్ ఏప్రిల్ 18 ,( జన సంఘర్షణ )
కామారెడ్డి జిల్లా, ఐఐటి రూర్కి వేదికగా ఈ నెల 24-26 వరకు (3 రోజుల ) అంతర్జాతీయ సదస్సులో యూనివర్సిటీ ఆఫ్ ఆర్డర్ ( నార్వే ) స్వదేశీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ న్యూఢిల్లీ, ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా పరిశోధన సంస్థలతో సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాస్పరస్ అండ్ గ్రేట్ భారత్ ఏ2047 సదస్సులో ప్రపంచవ్యాప్తంగా అనేక మంది మేధావులతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆర్థిక, సాంకేతిక, విద్య, సంస్కృతిక, ఆధ్యాత్మిక తదితర 9 అంశాలపై భారత్ విశ్వ గురువుగా నిలపడానికి చర్చించనున్నట్లు డా. సంతోష్ గౌడ్ తెలిపారు.

## శిశువు మరణంపై 'నోటీసుల' వేట

◆ భద్రాద్రి వైద్యశాలలో విచారణ సెగ!




భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిలో అభంశుభం తెలియని శిశువు మృతి చెందిన ఘటన, ఆసుపత్రి పాలనలోని లోపాలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఈ విషాదకర ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు బాధ్యులెవరో తేల్చే పనిలో నిమగ్నమై, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కే నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుండటం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేవలం కింది స్థాయి సిబ్బందిపై వేటు వేసి చేతులు దులుపుకోవడం కాకుండా, పరిపాలనా పరమైన పర్యవేక్షణ లోపాన్ని కూడా ప్రశ్నించడం గమనార్హం. ఆ రోజు విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం ఎంతవరకు ఉంది? అత్యవసర సమయంలో అందాల్సిన చికిత్సలో ఎందుకు జాప్యం జరిగింది? అనే కోణంలో లోతైన విచారణ సాగుతోంది. నిజానికి, నోటీసులు ఇవ్వడం వల్ల పోయిన ప్రాణం తిరిగి రాదు కానీ, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఉండాలంటే వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. ఆసుపత్రి అంటే కేవలం భవనం కాదు, అది రోగి నమ్మకానికి నిలయం. ఆ నమ్మకం వట్టి నోటీసులతో కాకుండా, చిత్తశుద్ధితో కూడిన చికిత్సతో పునరుద్ధరించబడినప్పుడే పేదవాడికి అసలైన న్యాయం జరుగుతుంది.

## ఇల్లందులో జనగణన శిక్షణ షురూ!

◆ భవిష్యత్ ప్రణాళికకు పునాది



ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన జనగణన ప్రక్రియకు ఇల్లందు పురపాలక సంఘం సన్నద్ధమైంది. మున్సిపాలిటీ పరిధిలో మొదటి దశ జనగణన కోసం ఎంపిక చేసిన 43 మంది సిబ్బందికి శనివారం సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం అంకెలను నమోదు చేయడం మాత్రమే కాకుండా, గృహాల గణనలో మరియు డేటా సేకరణలో పాటించాల్సిన సాంకేతిక మెలకువలపై అధికారులు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వివరాలు సామాజిక అభివృద్ధికి దిక్సూచి వంటివని, ఏ ఒక్క చిన్న తప్పు జరిగినా అది సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రభావం చూపుతుందని ఈ సందర్భంగా అధికారులు సిబ్బందిని హెచ్చరించారు. నిజానికి, జనగణన అనేది కేవలం ప్రభుత్వ లెక్కల నమోదు కాదు; అది రాబోయే దశాబ్ద కాలపు అభివృద్ధి ప్రణాళికలకు బలమైన పునాది. క్షేత్రస్థాయిలో సేకరించే ప్రతి సమాచారం పారదర్శకంగా, వాస్తవికతకు దగ్గరగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి పౌరుడికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి. అంకితభావంతో కూడిన ఈ విధి నిర్వహణే రేపటి పట్టణ ప్రగతికి అసలైన గీటురాయి.

## భద్రాద్రి రామయ్య చెంతన న్యాయమూర్తి

◆ స్వామివారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జస్టిస్ హరినాథ్!



భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం పుణ్యక్షేత్రం శనివారం ఒక విశిష్ట అతిథి రాకతో మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని సందర్శించి, భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖద్వారం వద్ద ఆయనకు అర్చక స్వాములు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. స్వామివారి దివ్య దర్శనం అనంతరం లక్ష్మీ తాయారు అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు, వేద పండితులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలను బహూకరించారు. నిజానికి, న్యాయపీఠం మీద ఉండి లౌకిక జగత్తులో న్యాయాన్ని అందించే వారు కూడా, ఆ ధర్మ స్వరూపుడైన రామయ్య చెంతన సామాన్య భక్తుల్లా మోకరిల్లడం మన సంస్కృతిలోని వినయానికి నిదర్శనం. పదవులు ఏవైనా, అంతిమంగా ఆ దైవ నిర్ణయం మరియు ధర్మపాలనపై ఉండే విశ్వాసమే సమాజానికి శ్రీరామరక్ష అని, ఈ పవిత్ర దర్శనం మనకు మరోసారి గుర్తు చేస్తోంది. మనిషి ఎంత ఎదిగినా మూలాలను మరవకూడదనే ఆధ్యాత్మిక సత్యాన్ని ఈ పర్యటన ప్రతిబింబించింది.

# నిరుపేదలకు సేవ చేయడమే నా జీవిత లక్ష్యం

◆ డా.ఎంఏ హకీమ్.
◆ వడదెబ్బతో మృతిచెందిన కుటుంబాలకు పరామర్శ,ఆర్థిక సహాయం అందజేత.
◆ ఒకే రోజు రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన డాక్టర్ హఖీమ్ నిరంతరం ఆయన ప్రజల మధ్యలో ప్రజా సేవకుడు ప్రజాలినాయకుడు
◆ ఆయన శ్రీమంతుడు కాదు ఆయనే డాక్టర్ ఎంఏ హఖీమ్



పోతంగల మండలం / ఏప్రిల్18/(జన సంఘర్షణ)
నిరుపేద ప్రజలకు సేవ చేయడమే నా జీవిత లక్ష్యమని, పేదలకు తోచిన విధంగా సహాయం చేస్తేనే ఎల్లప్పుడూ జీవితంలో గుర్తు ఉంటుందని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక సేవ మూర్తి,డాక్టర్ ఎంఏ హకీమ్ అన్నారు. శనివారం పోతంగల్ మండల కేంద్రం లో ఆయన విస్తృతంగా పర్యటించి ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన రసూల్, సిరిగంధం లాలయ్య కుటుంబాలకు పలకరించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా.ఎంఏ హకీమ్ మాట్లాడుతూ..వేసవి కాల దృశ్య మండు టెండలలో బీదవారు కడుపు తిప్పల కొరకు ఎంతో శ్రమించి ఎండతీవ్రతకు మృత్యువాత గావించడం విచారించ దగ్గ విషయమని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. రోజురోజుకు ఎండ తాపం పెరుగుతున్న తరణంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు వహించాలన్నారు. ఆపదలో ఉన్న వారికి తోచిన విధంగా సహాయ సహకారాలు అందించడం తనకు ఎంతగానో సంతోషాన్ని కలిగిస్తుందని గుర్తు చేశారు. ఆయన వెంట సుదం నవీన్, పబ్బ శేఖర్, పోశట్టి, మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

### అప్రమత్తతే రక్షణ కవచం: కేటీపీఎస్ లో అగ్నిమాపక వారోత్సవాల స్ఫూర్తి



పాల్వంచ ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి ఎంత ముఖ్యమో, పని చేసే కార్మికుని భద్రత అంతకంటే ప్రాధాన్యత కలిగినదని కేటీపీఎస్ 5, 6వ దశల చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు ఉద్ఘాటించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ సేఫ్టీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైర్ డెమో, కేవలం ఒక ప్రదర్శనగానే కాకుండా ప్రాణ రక్షణపై ఒక అవగాహన సదస్సులా సాగింది. వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యుత్ కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు పొంచి ఉంటాయని, ప్రతి ఇంజనీర్ మరియు కార్మికుడు రక్షణ పరికరాలను ధరించడం అలవాటు చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రమాదం జరిగినప్పుడు స్పందించడం కంటే, అది జరగకుండా అప్రమత్తంగా ఉండటమే అసలైన వృత్తి ధర్మం. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. పరిశ్రమలో మెరిసే యంత్రాల కంటే, వాటి వెనుక పని చేసే మనిషి ప్రాణం అత్యంత ఖరీదైనది. ఆ ప్రాణానికి రక్షణ కల్పించడమే ఈ వారోత్సవాల అసలైన ఉద్దేశ్యం.

## హక్కుల సాధనలో 'ఉద్యోగ' గర్జన

◆ పెండింగ్ బిల్లులకై ఇల్లందులో ధర్నా




ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే చోదక శక్తులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల పాలకులు ప్రదర్శిస్తున్న ఉదాసీనతను నిరసిస్తూ ఇల్లందులో టీజీఈ జేఏసీ గళమెత్తింది. పెండింగ్ బిల్లుల విడుదల, నూతన పీఆర్సీ అమలు మరియు మే 1 నుండి నిరంతరాయ వైద్య సేవల కల్పనే లక్ష్యంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ధర్నా.. ఉద్యోగుల ఆవేదనకు అద్దం పట్టింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే ఉద్యోగికి సకాలంలో వేతన ప్రయోజనాలు అందకపోవడం వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నిజానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగి సంక్షేమాన్ని విస్మరించడం అంటే అది పరోక్షంగా పరిపాలనను బలహీనపరచడమే. వ్యవస్థకు వెన్నుముకగా నిలిచేవారిని వీధుల పాలు చేయడం కాకుండా, వారి హక్కులను గౌరవించినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందన్నది పాలకులు గుర్తించాల్సిన సత్యం.

# జానకంపేటలో ముందస్తు బడిబాట కార్యక్రమం




ఎడపల్లి, ఏప్రిల్ 18 :( జన సంఘర్షణ )
ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో విద్యా చైతన్యానికి శ్రీకారం చుట్టారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా "ముందస్తు బడిబాట" కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో బ్యానర్లు పట్టుకుని గ్రామ వీధుల్లో నడుస్తూ, ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఉదయం వేళనే ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ క్లాసులు వంటి సౌకర్యాలతో పాటు విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక బోధనలు కూడా అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో కల్చరల్, క్రీడా కార్యక్రమాలు, ప్రతిభను వెలికితీసే వివిధ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జోన్స్ మాట్లాడుతూ... మా పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలో ఆధునిక సదుపాయాలు, డిజిటల్ విద్య మరింత అభివృద్ధి చెందుతున్నాయని, ప్రత్యేక బోధన పద్ధతులతో విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉత్తమ విద్య అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వంపై పివైఎల్ మండిపాటు




గుండాల, ఏప్రిల్ 18 (జన సంఘర్షణ) :
నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వాంకుడోతు మోతిలాల్ తీవ్రంగా విమర్శించారు. గుండాల మండల కేంద్రంలో జరిగిన పివైఎల్ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి కల్తీ ప్రమోద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఒక సంవత్సరంలో లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి అమలు ఎందుకు చేయలేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజీవ్ గాంధీ స్వయం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసిన లక్షలాది నిరుద్యోగులకు ఉపాధి ఎప్పుడు కల్పిస్తారో వెల్లడించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి, కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టెట్ పేరుతో నిరుద్యోగుల నుంచి భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శిస్తూ, టెట్ పరీక్షలను ఉచితంగా నిర్వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలు విస్తరిస్తున్నాయని, మద్యం ఆదాయంపై ప్రభుత్వం ఆధారపడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కొత్తగూడెం జిల్లాలో గుండాల మండలంలో ఎక్కువగా మొక్కజొన్న పండించే గిరిజన రైతులకు ఇప్పటికీ కొనుగోలు కేంద్రం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పివైఎల్ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ మండల అధ్యక్షుడు తాటి రమేష్, కల్తీ ప్రభాకర్, అరేం రామారావు, ఈసం రమేష్, కల్తీ పగడయ్య, ఈసం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం   తెలుగు దినపత్రిక
ఆదివారం
19 ఏప్రిల్ 2026

# రెండో వార్డులో సమస్యలపై చైర్‌పర్సన్ విస్తృత పర్యటన

- **ప్రజల వినతులు విని త్వరిత పరిష్కారానికి హామీ**

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ విస్తృతంగా పర్యటించారు. వార్డులోని అన్ని ప్రాంతాలను సందర్శిస్తూ స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పారిశుధ్య పనులు సరిగా నిర్వహించడం లేదని, చెత్తాచెదారం తొలగించాలని, కొత్త డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, సిసి రోడ్లు మంజూరు చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్నిచోట్ల సందుల్లో వ్యర్థాలు, పెద్ద రాళ్లు అడ్డుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అలాగే కోతులు, కుక్కల బెడదను తగ్గించాలని, శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివాసితులు చైర్‌పర్సన్ గారికి తెలిపారు. ప్రజలు విన్నవించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ధర్మల సంధ్య-మల్లేష్ దంపతుల ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ ఎండి యాకూబ్, శ్రీమతి మల్లేశ్వరి, వార్డు అధ్యక్షులు ఎస్కే సలీం, నేలమర్రి నాగరాజు, మలిపెద్ది కమలాకర్, కొత్తపల్లి నవతేజ, చింతలచెరువు సుమంత్, చింతలచెరువు వేణు, సాతెల్ల యాదగిరి, డాక్టర్ రవి, చీమల బొంది, చేకూరు



సత్యనారాయణ, ముత్తుమ్ సంతోష్ కుమార్ (చంటి), మునుగోటి ప్రదీప్ (నాని), తుపాకుల సైదులు, సరికొండ సంధ్య, చీమల భవాని, ధర్మల స్రవంతి, కొండపల్లి సంపత్, సాంబయ్య, దళితరత్న మేకల శ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్యంలో ఇదొక చీకటి రోజు...

- **మహిళా రిజర్వేషన్? బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడంపై బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి బజరంగ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.**

పోతంగల్/ఏప్రిల్18/(జనసంఘర్షణ)

భారత ప్రజాస్వామ్యంలో ఇది ఒక చీకటి రోజని బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి బజరంగ్ (హన్మాండ్లు) అన్నారు. పోతంగల్ మండల, కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కుట్రపూరితంగా బిల్లును అడ్డుకుంటున్నారు.
బజరంగ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, మహిళలకు 33శాతం రిజర్వేషన్లతో, మహిళా బిల్లు అమలుకు మహిళల అభ్యున్నతికి బాటలు వేస్తుంటే కాంగ్రెస్, ఇండికూటమి కుట్రపూరితంగా దానిని అడ్డుకుందన్నారు. ప్రతిపక్షాలు అంతా కలిసి 145కోట్ల జనాభాలో 52శాతం మహిళలు ఉండగా వారికి న్యాయంగా అందాల్సిన 33శాతం రిజర్వేషన్లను




అన్యాయంగా అడ్డుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ, దృష్టిలో మహిళలంటే ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీలేనని.. డీలిమిటేషన్ బిల్లు, సాకుతో, ఎక్కడ మహిళలు చట్టసభల్లోకి అడుగుపెట్టి బీజేపీ ,కి క్రెడిట్ ఇస్తారో అన్న అక్కసుతో ఈ బిల్లు నిలిపివేయించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ అధికార ప్రతినిధి, మక్కయ్య, గంగాధర్ పటేల్, ప్రకాష్ పటేల్, పబ్బ శేఖర్, నాగయ్య, సుధాకర్ గౌడ్, లక్ష్మణ్ పటేల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల జనాభా శాతానికి తగినట్టుగా 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలి

- **మంద కృష్ణ మాదిగ మాటలు కుల గణన రిపోర్ట్ ద్వారా నిజమయ్యాయి.**
- **ఆనాడు 9% రిజర్వేషన్ ను స్వాగతించిన వాళ్ళు జాతి ద్రోహులు.**
- **అన్ని రకాల ప్రభుత్వ నియామకాల్లో 11% వాటా మాదిగలకు ఇవ్వాలి.**
- **మహాత్మా ఫూలే ద్విశత జయంతి కమిటీలో మంద కృష్ణ మాదిగకు చోటు కల్పించినందుకు ప్రధానమంత్రికి కృతజ్ఞతలు.**
- **ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ.**

నిజామాబాద్ సిటీ . ఏప్రిల్ 18 . ,(జన సంఘర్షణ )

వివరణ :- తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ఏకైక కులం మాదిగలు మాత్రమే అని గత 12 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని, మా జనాభా 10% నుండి 11% ఉందని, ఎస్సీ వర్గీకరణలో కూడా మాకు అంతే వాటా కేటాయించాలని మంద కృష్ణ మాదిగ గతంలో లేవనెత్తిన ప్రశ్నలు సంపూర్ణ న్యాయమని కుల గణన రిపోర్ట్ తో స్పష్టం అయిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ.. " తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు.అయినా రేవంత్ రెడ్డి ఆనాడు న్యాయం చేయలేకపోయారు. ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహా ఋజువైందని,ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం అని అన్నారు. సందర్భం వచ్చినప్పుడు న్యాయం చేస్తామని మాట్లాడిన ముఖ్యమంత్రి ఆ సందర్భం ఇప్పుడు వచ్చిందని గుర్తించాలని అన్నారు. మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని అన్నారు. అలాంటి ద్రోహులకు కుల గణన రిపోర్ట్ చెంప పెట్టు లాంటిదని అన్నారు. మాదిగల జనాభా శాతానికి కన్న తక్కువ శాతం రిజర్వేషన్లు రావడాన్ని స్వాగతించిన ద్రోహులు ఇప్పుడు మాదిగ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కీలక ఘట్టంలో జాతికి వెన్నుపోటు పొడిచి తీరని ద్రోహం చేసిన వాళ్లకు జాతి గురించే మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు. ద్రోహం ఎప్పటికైనా ఓడిపోతుందని సత్యమే ఎప్పటికైనా గెలిచి తీరుతుందని అన్నారు.జాతికి ద్రోహం చేసిన వాళ్లకు జాతి గురించి మాట్లాడే అర్హత ఇకపై లేదని అన్నారు.
ఇక ప్రభుత్వం బహిరంగపరిచిన కుల గణన రిపోర్ట్ లో జనాభాలో మాదిగలు ప్రథమ స్థానంలో ఉన్నట్లుగానే దినసరి కూలీ పని చేసుకునే వారిలో, అలాగే భూమి లేని నిరుపేదలు అత్యధికంగా ఉన్న వారిలో కూడా మాదిగలే ప్రథమ స్థానంలో ఉన్నారు. ఇది మాదిగల పేదరికాన్ని, సామాజిక వెనుకబాటుతనాన్ని సూచిస్తుందని అన్నారు. గత 80 ఏళ్ల కాలంలో మాదిగలలో ఉన్న పేదరికాన్ని తొలగించడానికి ఏ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో పని చేయలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలలో ఉన్న పేదరికాన్ని తొలగించడానికి తగిన సంక్షేమ పథకాల్ని ప్రవేశ పెట్టాలని, ప్రభుత్వ భూములను మాదిగలకు పంచాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ప్రభుత్వరంగ నియామకాల్లో 11% వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అత్యధిక జనాభా కలిగిన మాదిగలు శాసనమండలిలో, లోక్ సభలో, రాజ్యసభలో, నామినేటెడ్ పోస్టులో ఒక్కరు కూడా లేరని, ఈ అన్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని అన్నారు. తెలంగాణలో అత్యధిక జనాభా



కలిగిన మాదిగలు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో బలమైన నిర్మాణాత్మక శక్తిగా ఎదగడానికి మరింత సంఘటితం కావాలని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు ఫూలే ద్విశత జయంతి ఉత్సవాలను రెండు సంవత్సరాల పాటు నిర్వహించడానికి నిర్ణయం తీసుకుందని, అందుకోసం ప్రధానమంత్రి చైర్మన్ గా 126 మందితో కమిటీ ఏర్పాటు చేసిందని, ఆ కమిటీలో ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను సభ్యుడిగా నియమించడం జరిగిందని, అందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారికి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇది మాదిగలు ఇచ్చిన గుర్తింపు, గౌరవంగా భవిస్తామని అన్నారు. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. దేశంలో మొదటిగా మహాత్ముడిగా నిలిచిన మహాత్మా ఫూలే సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంఎంఎస్. జాతీయ నాయకురాలు యమున మాదిగ, ఎమ్మార్పీఎస్. జిల్లా ప్రధాన కార్యదర్శి లాసింగారి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్. జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, మందర్న మారుతి మాదిగ, ఎంఎంఎస్. జిల్లా నాయకురాలు పద్మ మాదిగ, ఎం ఆర్ పి ఎస్. సీనియర్ నాయకులు చెవురి సంజీవయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్. నిజామాబాద్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, టోన్ నాయకులు రాహుల్ మాదిగ, ఎల్లన్న మాదిగ, సత్యం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 19 మందికి ఉచిత షుగర్ పరీక్షలు

బీర్పూర్/ఏప్రిల్18/(జన సంఘర్షణ)

బీర్పూర్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 19 మందికి ఉచిత షుగర్ పరీక్షలు కూడాచేసిన ఇద్దరికీ గవర్నమెంట్ హాస్పిటల్ కీ రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతాలే రమేష్, సీనియర్లయన్స్ మేకలవిట్టల్ సార్, ల్యాబ్ టెక్నీషియన్ నారం ప్రవీణ్,భరత్, శ్రీకాంత్, గ్రామ ప్రజలు తదితరులుపాల్గొన్నారు.



# 'రోడ్డు భద్రత నియమాలను పాటించాలి'

భిక్కనూర్, ఏప్రిల్ 18 ( జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలంలో ఎస్వీ గార్డెన్ లో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని ఏఎస్పీ చైతన్య రెడ్డి సూచించారు. శనివారం భిక్కనూర్ ఎస్వీ గార్డెన్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోలీస్ కళాజాత బృందం ఆటపాటలతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రాణ రక్షణ కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# బీబీపేట: అన్నదాతల ఆందోళన.. సబ్ స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ధర్నా

బీబీపేట్, ఏప్రిల్ 18, ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలోని జనగామ, సీతారాంపల్లి గ్రామాల రైతులు ఈరోజు ఉదయం జనగామ సమీప సబ్ స్టేషన్ రహదారిపై ధర్నాకు దిగారు. రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలను నిలిపివేశారు. గత నాలుగు రోజులుగా త్రీఫేజ్ కరెంట్ 12 గంటలకు గాను 9 గంటలు మాత్రమే ఇస్తున్నారని రైతులు ఆరోపించారు. దీంతో పంటలకు సరిపడా నీరందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతుల సమస్య ను పరిష్కరించాలని కోరారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్

భైంసా, ఏప్రిల్ 18: (జన సంఘర్షణ)



భైంసా మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన హెడకే మాధవ్ రావు ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లె మోహన్ రావు పటిల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాధవ్ రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో తమవంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుభాష్, కుంబి మాజీ సర్పంచ్ ఆనంద్ రావు, అలాగే గ్రామస్థులు పాల్గొన్నారు. వారు కూడా బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ అండగా నిలిచారు.

# ప్రజాక్షేత్రంలో చైర్‌పర్సన్ ఇల్లందు 2వ వార్డులో సమస్యల సెగ!

ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)




పాలన అంటే గదులకే పరిమితం కాదని, ప్రజల గడప తొక్కడమే అసలైన ప్రజాస్వామ్యమని నిరూపిస్తూ ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ శనివారం 2వ వార్డులో సుడిగాలి పర్యటన చేపట్టారు. వార్డులోని ప్రతి గల్లీని క్షుణ్ణంగా పరిశీలించిన ఆమెకు, అడుగడుగునా ప్రజా సమస్యలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా పారిశుధ్య లోపం, పేరుకుపోయిన చెత్తాచెదారం, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై ప్రజలు చైర్‌పర్సన్‌ను నిలదీశారు. రహదారులకు అడ్డంగా ఉన్న నాపరాళ్లు, వ్యర్థాలు వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తున్నాయని, వీధిలైట్లు లేక చీకటి సామ్రాజ్యం రాజ్యమేలుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మౌలిక వసతులే కాకుండా, కోతుల దాడి, కుక్కల బెడద, మితిమీరిన శబ్ద కాలుష్యంతో ప్రశాంతత కరువైందని వారు ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన చైర్‌పర్సన్, ప్రజల వినతులపై సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తానని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో మాజీ కౌన్సిలర్ ఎండి యాకూబ్, వార్డు అధ్యక్షులు ఎస్కే సలీం సహా పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యం కాదు.. మృత్యువుకు ఆహ్వానం

- **భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం!**

భద్రాచలం ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)




పేదవాడి ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి నేడు అంటువ్యాధుల అడ్డాగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. టీబీ వార్డులోని మరుగుదొడ్ల మరమ్మతులను సైతం పట్టించుకోని అధికార యంత్రాంగం, ఆ విభాగం రోగులను నేరుగా ఐసీయూ, ప్రసూతి వార్డుల మరుగుదొడ్లకు పంపడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. గాలి ద్వారా అత్యంత వేగంగా వ్యాపించే క్షయ వంటి వ్యాధిని, అత్యవసర చికిత్స పొందుతున్న రోగులకు ,బాలింతలకు 'కానుక'గా ఇచ్చేలా సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అంటువ్యాధుల నియంత్రణపై కనీస అవగాహన ఉండాల్సిన వైద్య ఆరోగ్య శాఖే ఈ విధంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు, మానవత్వానికే మచ్చ తెచ్చే వైఫల్యం. పాలకులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా మేల్కొని ఈ అస్తవ్యస్త వ్యవస్థను చక్కదిద్దకపోతే, సామాన్యుడి ప్రాణం ఆసుపత్రి గడప దాటడం కష్టతరం కాక తప్పదు. వ్యవస్థలో చలనం రావాల్సింది ఎప్పుడో ఒక్కసారి వచ్చే తనిఖీలతో కాదు, తోటి మనిషి ప్రాణం పట్ల ఉండే కనీస గౌరవం, బాధ్యతతోనే అని ఈ ఉదంతం మనకు గుర్తు చేస్తోంది.

# నిజామాబాద్‌లో ప్రమాదాల నివారణకు భారీ చర్యలు

◆ 55 బ్లాక్ స్పాట్లను స్వయంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, లిప్స్




తెలంగాణ నిజామాబాద్/ఏప్రిల్18/(జన సంఘర్షణ)

నిజామాబాద్, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ విస్తృత స్థాయిలో చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం రోజున నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌ల పరిధిలో గుర్తించిన 55 బ్లాక్ స్పాట్లను ఎస్పైలు, సీఐలు, ఏసీపీలు, అదనపు డీసీపీ (అడ్మిన్)తో కలిసి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, స్వయంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట దర్గా వద్ద కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలనలు నిర్వహించి, ప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలను గుర్తించారు. అధిక వేగం, ప్రమాదకర వంపులు, స్పష్టమైన సూచిక బోర్డుల లేమి, రాత్రి వేళల్లో తగిన లైటింగ్ లేకపోవడం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా తేలాయి. తక్షణ చర్యలకు ఆదేశాలు. ప్రమాదాల నియంత్రణ కోసం కమిషనర్ పలు కీలక సూచనలు జారీ చేశారు: హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ఫ్లోరోసెంట్ పెయింటింగ్, రేడియం, స్టిక్కర్లతో పోలీస్ కటౌట్ల ఏర్పాటు, స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం, రోడ్డు మార్కింగ్‌ల స్పష్టత, స్ట్రీట్ లైటింగ్ మెరుగుదల అదేవిధంగా ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణను పెంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యం డ్రైవర్లలో భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ తప్పనిసరి వంటి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సహకారం కీలకం ప్రమాదాల నివారణలో ప్రజల పాత్ర కూడా ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ఈ సమగ్ర చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి బదిలీ.. సంగారెడ్డిలో పోస్టింగ్!

తెలంగాణ కామారెడ్డి/ఏప్రిల్18/(జన సంఘర్షణ)

ఏఎస్పీ బదిలీ తర్వాత కొత్తగా ఎవరు రానున్నారనేది ఇప్పటివరకు తెలియరాలేదు. అయితే గతంలో మాదిరిగా డీఎస్పీ క్యాడర్ అధికారి వస్తారా..? లేక సబ్ డివిజన్ ఏఎస్పీ హోదాలో నియమిస్తారా.. అనేది తెలియాల్సి ఉంది. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి బదిలీ అయ్యారు. సంగారెడ్డి అడిషనల్ ఎస్పీగా ఆమెను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో కామారెడ్డి డీఎస్పీలుగా మాత్రమే ఇక్కడ పని చేసేవారు. 15 నెలల పాటు, భరోసా నింపే ప్రయత్నం. 15 నెలల పాటు మొట్టమొదటిసారిగా సబ్ డివిజన్ ఏఎస్పీ స్థాయి అధికారిణిగా చైతన్య రెడ్డి 2025 జనవరి 1 న బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో దాదాపు 15 నెలల పాటు పనిచేశారు. ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విధుల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. కేసుల విచారణలో పారదర్శకత పెంచేలా చర్యలు తీసుకున్నారు.



జిల్లాలో ముఖ్యంగా షీ టీం బలోపేతం కోసం కృషి చేశారు. గ్రామాల్లో షీ టీంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోక్సో కేసుల విచారణతో నిక్కచ్చిగా వ్యవహరించారు.

**భరోసా నింపే ప్రయత్నం**

తప్పు చేసిన వ్యక్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నారు. దాంతో కేసుల విషయంలో ఏఎస్పీ వద్దకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించారు. మహిళా సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పోక్సో కేసు బాధితులతో ప్రత్యేకంగా మాట్లాడి వారిలో భరోసా నింపే ప్రయత్నం చేయగా ఇటీవల అనేక కేసులు నమోదయ్యాయి. వాటిలో చాలా మందికి శిక్షలు కూడా పడ్డాయి. ఏఎస్పీ బదిలీ తర్వాత కొత్తగా ఎవరు రానున్నారనేది ఇప్పటివరకు తెలియరాలేదు. అయితే గతంలో మాదిరిగా డీఎస్పీ క్యాడర్ అధికారి వస్తారా..? లేక సబ్ డివిజన్ ఏఎస్పీ హోదాలో నియమిస్తారా.. అనేది తెలియాల్సి ఉంది.

# క్రికెట్ మ్యాచ్‌కు పిలువ లేదని ట్రాక్టర్‌తో పీచును దున్నేశాడు



మహారాష్ట్ర జాల్గావ్/ఏప్రిల్18/(జనసంఘర్షణ)

క్రికెట్ టోర్నమెంట్కు ఒక నాయకుడిని పిలవ లేదనే కోపంతో ఆయన మద్దతుదారుడు రెచ్చిపోయాడు. మ్యాచ్ జరుగుతుండగా టక్టర్‌తో పీచ్‌ను దున్నేశాడు. అనవసరంతో పరిణామంతో మ్యాచ్ మధ్యలోనే ఆగిపోయింది. ఈ ఘటన మహారాష్ట్రలోని జాల్గావ్ లో జరిగింది. ఇంతకు సంబంధించిన వీడియో వైరల్ అవుతుంది. క్రికెట్ పిచ్చి ఎంతైనా తెగించేలాగా చేస్తుందని పలువురు.అంటుండగా సదురు అరెస్టు చేయాలని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట: మాజీమంత్రి కాకాణి

నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, మాచర్ల వారి పాలెం, కొత్తపాలెం గ్రామాలల్లో పర్యటించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి.చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసగించడంలో దిట్ట. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేశాడంటూ కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన ప్రజలు. జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, కూటమి ప్రభుత్వం అడ్డుపడుతుందని గ్రామస్తుల విమర్శ. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, మోసపోయామంటూ కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన రైతులు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందిస్తామని భరోసా కల్పించిన కాకాణి.

కాకాణి స్క్రోలింగ్ పాయింట్స్: జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు నాయుడు అడ్డుకుంటున్నాడు. గ్రామాలలో నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ లు, నిరాధారణకు గురై, కళ తప్పుతున్నాయి. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని, అందుబాటులోకి తీసుకురావడానికి జగన్మోహన్ రెడ్డి గారు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేస్తే, జగన్మోహన్ రెడ్డి గారికి మంచి పేరు వస్తుందని చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే నీరుగార్చాడు. సచివాలయ వ్యవస్థలు అలాంటి వ్యవస్థలు, తీసుకురావడానికి జగన్మోహన్ రెడ్డి వల్లే సాధ్యమైంది తప్ప, చంద్రబాబు 100 జన్మలెత్తినా సచివాలయ వ్యవస్థలాంటి ఆలోచనే చంద్రబాబు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 22 నెలలు అవుతున్నా, కొత్త పెన్షన్లు మంజూరు కాక, వృద్ధులు గోడు వెళ్ళబోసుకుంటున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, దళారులు దోచుకుంటూ, రైతులను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల కష్టాలు అన్ని, ఇన్ని కావు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆక్వా సాగు చేస్తున్న రైతుల అందరిని ఆక్వా జోన్ లో చేర్చి యూనిట్ విద్యుత్ 1.50 పైల కే అందించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరికే 1.50 పైసలు సబ్సిడీ అందిస్తూ, ఆక్వా రైతులకు ద్రోహం తలపెట్టింది. అభివృద్ధి, సంక్షేమంలో జగన్మోహన్ రెడ్డి ఏ రోజు పార్టీ ప్రస్తావన లేకుండా, రాజకీయాలకు అతీతంగా అమలు చేశాడు. కూటమి ప్రభుత్వంలో ప్రతి విషయంలో రాజకీయ జోక్యం తప్ప,ప్రజల క్షేమం గురించి పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అవినీతిలో మునిగి తేలడం తప్ప, ప్రజల బాగోగులు పట్టించుకునే పరిస్థితులు లేవు. భవిష్యత్తులో మరలా తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయం. అధికారులు ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలు విని, ప్రజలకు ద్రోహం చేస్తే, భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని శ్రావ్య అత్యుత్తమ ప్రతిభ..



బోధన్ ఏప్రిల్ 18..జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని పాండు ఫారంలో గల పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరించింది. 10 సిబిఎస్ఈ బోర్డు రిజల్ట్ 2026 శనివారం విడుదలైన ఫలితాలలో బోధన్ పట్టణంలోని తట్టికోట్ కాలనీ కి చెందిన దాసరి శ్రావ్య 96.8, రిషిక 94.2,చరిత 93.8శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్బంగా విద్యాలయంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రావ్య ను, ఉపాధ్యాయులు అభిందించారు.

## లోక్‌సభలో..మహిళా రిజర్వేషన్ బిల్లు..

◆ వీగిపోయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్




ఢిల్లీ /ఏప్రిల్18/(జనసంఘర్షణ)

భారత దేశ చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే మరుపురాని రోజు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్ష నాయకులు అంతా ఏకమై ఒక జాతీయ విపత్తును నివారించిన సందర్భం. నల్ల బిల్లులను ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ ఐకమత్యంతో, సాహసంతో నిలిచిన మిత్రపక్షాల నాయకులు ఎం.కే. స్టాలిన్ మమతా బెనర్జీ అఖిలేశ్ యాదవ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, లాలు ప్రసాద్ యాదవ్, హేమంత్ సోరెన్ , ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, అరవింద్ కేజ్రీవాల్, అలాగే కమ్యూనిస్ట్ పార్టీల నాయకులందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు ఈ కార్యక్రమంలో తదితరులు, పాల్గొన్నారు.

## క్రీడలతోనే యువతకు బలం...


◆ వ్యసనాలకు దూరంగా ఉండాలి, ధారావత్ హర్ష నాయక్.



అశ్వాపురం,ఏప్రిల్ 18 (జన సంఘర్షణ).

అశ్వాపురం మండలం తుర్రంవారిగూడెం గ్రామంలో యువతను క్రీడల వైపు దారితీసే అభినందనీయ చర్య చోటుచేసుకుంది. గ్రామ ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ తన సొంత ఖర్చులతో యువకులకు క్రికెట్ బ్యాట్ అందజేసి క్రీడలను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని కలిగించి క్రమశిక్షణను నేర్పుతాయని తెలిపారు. గ్రామం నుండి ప్రతిభావంతమైన క్రీడాకారులు ఎదగాలని తన ఆకాంక్షగా పేర్కొన్నారు.ఉప సర్పంచ్ హర్ష నాయక్ అందించిన ప్రోత్సాహానికి గ్రామ యువకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తమ క్రీడా ఆసక్తిని గుర్తించి అవసరమైన సామగ్రిని అందించడాన్ని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో బాధవత్ నరేష్, జగదీష్, వాసు, గణేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఈ చర్య ఆదర్శంగా నిలుస్తోంది.

## బోధన్ నియోజకవర్గ పీడీఎస్ బియ్యం పట్టివేత



బోధన్/ఏప్రిల్18/(జన సంఘర్షణ)

జజూ టీము బోధన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస్ నగర్ లో ఉన్న సాయి అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు పై రైడ్ నిర్వహించరు. రెండు ఆటోలు ఒక లారీ.నుంచి మొత్తం 144.2 క్వింటాళ్ల ధాన్యం అక్రమంగా ఉన్నట్లు గుర్తించారు.వాటిని స్వాధీనం చేసినట్టు డిటి హనుమంతు తెలిపారు.కేసు నమోదు చేసినట్టు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

## నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచరాం ఇట్టి వలె ఆయన తల్లి మరణించడం

పొతంగల్ సోంపూర్/ఏప్రిల్17/ (జన సంఘర్షణ)



పోతంగల్ మండల కేంద్రం సోంపూర్ టాపిక్లి గ్రామానికి మన నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పోచీరంమాదిగ గారి మాతృమూర్తి కర్రె రాధా బాయ్ 30వ తేదీన మరణించడం జరిగింది. కావునా ఆరోజు అందుబాటులో లేని సమయంలో ఈరోజు నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కనక ప్రసాద్, మాదిగ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు, ప్రవీణ్, సంతోష్, నరేష్, మాదిగ పోచీరాం గారి సోంపూర్ టాక్లీ తన నివాసానికి వచ్చి పోచిరాంకు నిజామాబాద్ జిల్లాకమిటీ వారు వచ్చి పరంచారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
19 ఏప్రిల్ 2026

# హిందూ సమ్మేళనం నేపథ్యంలో ఘనంగా ద్విచక్ర వాహన ర్యాలీ





**ఉప్పల్ జనసంఘర్షణ :**
నేడు జరగబోయే హిందూ సమ్మే ళనం దృష్ట్యా శనివారం ఉదయం హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై గణేష్ నగర్, పోలీస్ కాలనీ, మధుర నగర్, శ్రీనివాసపురం మీదుగా పాలిటెక్నిక్ కళాశాల వరకు ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ ర్యాలీలో సమితి ప్రధాన కార్యదర్శి పోలా రామే శ్వరరావు, ఖజానాదారు భవేరిశెట్టి రమేష్, సంయుక్త కార్యదర్శి ఒగిరాల సాయిరాం పాల్గొ న్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ నాయకులు తిండేరు హనుమంతరావు, వలపు జగన్, సోమ శ్రీనివాస్, వార్ల బాలరాజు, హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. ర్యాలీ అనంతరం హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, భారీ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి నాయకులు పిలుపునిచ్చారు.

## చర్లపల్లి నుండి ఉప్పల్ కు షటిల్ సర్వీసులు ప్రారంభం

**చర్లపల్లి జనసంఘర్షణ :**
ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు షటిల్ బస్ సర్వీసులను ప్రారంభించినట్లు ఆర్టీసీ చెంగిచర్ల డిపో మేనేజర్ కె. కవిత తెలిపారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్కు చేరుకునే మరియు అక్కడి నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ఉప్పల్ మెట్రో రైల్వే స్టేషన్ వరకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ షటిల్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 5 గంటల నుండి రాత్రి 12.20 గంటల వరకు నిరంతరంగా ఈ బస్సులు నడుస్తాయని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించినట్లు చెప్పారు. దీంతో ప్రయాణికులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ఆమె అభిప్రాయ పడ్డారు. ప్రత్యేకంగా మెట్రో రైలు సేవలను వినియోగించే వారికి ఈ షటిల్ సర్వీసులు అనుసంధానంగా పనిచేసి ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చనున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కె. కవిత విజ్ఞప్తి చేశారు.



## సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**ఉప్పల్ జనసంఘర్షణ :**
బీరప్పగడ్డ ప్రాంతంలోని ఏఆర్కే రెసిడెన్సీ నుండి వంజరి నర్సింగరావు ఇంటి వరకు, అక్కడి నుండి శంకరయ్య కిరాణా దుకాణం వరకు సుమారు 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పరిశీలించారు. శనివారం ఉదయం బస్తీ వాసులతో కలిసి పనుల ప్రాంతాన్ని సందర్శించిన ప్రవీణ్ ముదిరాజ్, కాంట్రాక్టర్ను పిలిపించి వెంటనే పనులను ప్రారంభింపజేశారు. రోడ్డు వెడల్పు 4.5 మీటర్లకు తగ్గకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా నిర్మాణ పనుల సమయంలో బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా స్థానికులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కొండ జగన్, వంజరి నర్సింగరావు, శ్రీనివాస్ యాదవ్, పండ్ల కిషన్, తిరుపతి యాదవ్, గొరిగి ఐలేష్, బంటి గౌడ్తో పాటు బస్తీ పెద్దలు బుచ్చిరెడ్డి, సల్ల రాజిరెడ్డి, సత్యనారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో గ్యాస్ వినియోదారుల కష్టాలు.

సరైన సమాధానం లేక నానా అవస్థలు........

నిల్వలు ఉన్నా కూడా సరఫరా లేదు

ఏదో ఒక సాకుతో వెళ్లబుచ్చుతున్న వైనం.

**చంద్రుగొండ జనసంఘర్షణ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం లోని గ్యాస్ వినియోగదారుల కష్టాలు చూస్తే మనసు చలించిపోతోంది. ఉదయం 6 గంటలకు కార్యాలయానికి వస్తే మరల సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మండుటెండలో సరైన సౌకర్యాలు కూడా లేకుండా కార్యాలయం చుట్టూ పడిగా పులు కాస్తున్నారు. ఒకరిది ఓటిపి సమస్య మరొకరిది బ్యాంకు లింకేజ్ సమస్య మరొకరిది అప్డేట్ సమస్య ఇలా ప్రతి ఒక్కరికి ఒక్కొక్క సమస్య సృష్టిస్తూ కాలయాపన చేస్తున్నారు. ఒకవేళ అన్ని సక్రమంగా ఉన్నా కూడా పది రోజులు సమయం కావాలి అని బదిలిస్తున్నారు.



# దళిత హక్కుల పరిరక్షణ కోసం సమరశంఖం

**దళిత రైట్స్ మూవ్ మెంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్ నిర్మల్**


**వరంగల్ / జనసంఘర్షణ**
దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో, రాజ్యాంగబద్ధమైన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని దళిత రైట్స్ మూవ్ మెంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి వివిఎస్ నిర్మల్ ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్ పీఎస్) తెలంగాణ రెండవ మహాసభను ప్రారంభిస్తూ ఆయన ప్రసంగించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, గిరిజనులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలలోనే దళితులు, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. దళితులపై దాడులను అరికట్టడంలో ఎన్డీయే, బిజెపి పాలకులు విఫలం అయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పెండింగ్లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. దళితులకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన మండిపడ్డారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 'దళిత బంధు' పథకాన్ని ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు కావాలని, బాధితులకు తక్షణ న్యాయం, పరిహారం అందాలని డిమాండ్ చేశారు. బ్యాక్లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. భూమి లేని నిరుపేద దళితులకు సాగు భూమిని పంపిణీ చేయాలని, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించి, విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులు ఇంకా ఆర్థిక, సామాజిక వివక్షకు గురవుతూనే ఉన్నారని అన్నారు. తమ హక్కుల సాధన కోసం గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని జాతీయ ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు సంగి ఎలేందర్, ప్రధాన కార్యదర్శి జన్ను రవి, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఒరిగిన స్తంభం సరి చేసేది ఎప్పుడు??...

- సుజాతనగర్ హరిజనవాడలో ప్రమాద ఘంటికలు
- శిధిలావస్థలో ఇనుప స్తంభాలు
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
- ఈదురు గాలులతో ఎప్పుడు పడిపోతుందో

**సుజాతనగర్ జనసంఘర్షణ :**
సుజాతనగర్ పరిధిలోని హరిజనవాడ గ్రామంలో పురాతన కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రాణహాని ముప్పుగా మారాయి. ముఖ్యంగా ఒక స్తంభం పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా నిలిచి ఉండటం గ్రామస్తులను భయాందోళనలకు గురిచేస్తోంది. గ్రామంలో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఇనుప స్తంభాలు కాలక్రమేణా బలహీనమై ఇప్పుడు కూలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సమీప గ్రామాల్లో ఇలాంటి పాత ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసిన అధికారులు, హరిజనవాడ విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. "మా గ్రామం మీదే ఎందుకు వివక్షత?" అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒరిగి ఉన్న స్తంభం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాబోయే ఎండాకాలంలో బలమైన ఈదురు గాలులు వీస్తే ఈ స్తంభం నేలకూలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు చెబుతున్నారు. అలా జరిగితే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు ఆడుకునే ప్రదేశం, ప్రజలు తరచూ వెళ్లే మార్గం దగ్గర ఈ స్తంభం ఉండటం మరింత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయంతో గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను వెంటనే స్పందించి ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్రామంలోని అన్ని పాత ఇనుప స్తంభాలను కూడా పరిశీలించి అవసరమైతే మార్పిడి చేయాలని కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అత్యవసరం. సుజాతనగర్ హరిజనవాడలో ఒరిగిన స్తంభం సమస్య కేవలం ఒక నిర్మాణ సమస్య మాత్రమే కాదు -- ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యవసర అంశం. అధికారులు ఇప్పటికైనా మేల్కొని వెంటనే చర్యలు తీసుకుంటేనే పెద్ద ప్రమాదాన్ని నివారించవచ్చు.



# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**-రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్/ జనసంఘర్షణ :**
ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం రామంతాపూర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన పరమేశ్వర్ రెడ్డి అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లు, తల్లిదండ్రులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడం లేదని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు అవసరమని వివరించారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని, ఇతర మౌలిక వసతులు కూడా కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు తో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ జెడ్పిహెచ 'ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లత, మండల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రేణుక, డాన్ బిక్షపతి, ఎర్రం శ్రీనివాస్, విజయ్ కుమార్, సిద్ధగోని రాజు, రవీందర్ రావు, కిరణ్, రమేష్, రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండ్ రఫీక్, ఎండ్ తాఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, లూకాస్, శామ్యూల్, జంగయ్య, సందీప్, కండి శ్రవణ్, ఉపేందర్ రెడ్డి, పూస సతీష్, బాబురావు, శ్రీధర్, బుల్లెట్ అశోక్, భాస్కర్, సచిన్, జిల్లు, నాగమల్లయ్య, కే శంకర్, శ్రీనివాస్ గౌడ్, లింగం, నయీమ్, రాజు, సతీష్ గౌడ్, నర్సింహ, మహేష్, రవి, అంబికతో పాటు పలువురు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.






# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం:పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ జనసంఘర్షణ :**
ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద ఎల్ఓసీ ద్వారా నిధులు మంజూరు చేయించి, శనివారం ఆయా కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవానీనగర్కు చెందిన కుంట్ల సుశీలకు రూ. 2,50,000, మల్లాపూర్ డివిజన్లోని ఎస్వీ నగర్కు చెందిన సంగీతకు రూ. 2,50,000, కాప్రా డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్కు చెందిన నేహాకు రూ. 1,75,000 ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేయించారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వివరాలను కాప్రా, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కొబ్బరి నాగ శేషు, కప్పర సాయి గౌడ్, నెమలి అనిల్ కుమార్ పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co